సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

ఆదివారం । 24 । నవంబర్ । 2024



గజ్జె ఘల్లుమంది
8లో

విశాఖ జీచ్‌రోడ్డులో ఓ ఫంక్షన్ హాల్ ఎదురుగా శనివారం ఆదివాసీ స్వాభిమాన ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి.



'కొత్తపల్లి'కి పర్యాటకుల తాకిడి

జి.మాడుగుల: కొత్తపల్లి జలపాతానికి శనివారం పర్యాటకుల తాకిడి నెలకొంది. జలపాతంలో స్నానాలు చేస్తూ సందడి చేశారు.



వలిసె అందాల కనువిందు

ముంచంగిపుట్టు: మండల కేంద్రం నుంచి భూసిపుట్టు వెళ్లే మార్గంలోని ఘాట్‌లో వలిసె పూల అందాలు కనువిందు చేస్తున్నాయి.



చెరువులవేనంలో కనువిందు చేస్తున్న ప్రకృతి సోయగం

పచ్చటి పర్వత శ్రేణులను ముద్దాడుతున్న మేఘమాలలు..దట్టంగా కమ్ముకున్న పొగమంచు.. శ్వేత వర్ణంలో మెరిసిసోయే మంచు దుప్పట్లు.. మలుపు తిరిగే కొండ అంచుల్లో కనువిందుచేసే అటవీ అందాలు.. ఓవైపు చల్లని గాలులు మరోవైపు ఆకుపచ్చని హరిత అందాలు.. అడవులపై పరిచినట్టుగా పవళించే మేఘాలు.. ఇలాంటి ఆహ్లాదకరమైన వాతావరణంలో ఎంజాయ్ చేయాలంటే కశ్మీర్ వరకు వెళ్లాల్సిన అవసరం లేదు. లంబసింగిని సందర్శిస్తే సరిపోతుంది. ఇక్కడ ప్రకృతి అందాలను చూస్తే వావ్ అనాల్సిందే.

- పర్వతశ్రేణుల్లో హరిత సోయగాలు
- కనువిందు చేస్తున్న అటవీ అందాలు
- అడవులపై పరిచినట్టుగా మేఘ సౌందర్యం
- తరలివస్తున్న పర్యాటకులు
- కనిష్ట ఉష్ణోగ్రతల నమోదుతో ఆహ్లాదకర వాతావరణం
- లంబసింగికి పర్యాటకంగా తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యేక గుర్తింపు

మన కాశ్మీరం

SUNDAY SPECIAL

చింతపల్లి: మండలంలోని లంబసింగికి తెలుగు రాష్ట్రాల్లో ఓ ప్రత్యేకత ఉంది. చలికాలంలో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యే ప్రాంతం ఇదే కావడం అందుకు కారణం. చలికాలం బాగా ఉధృతంగా ఉండే తరుణంలో ఇక్కడ సగటు ఉష్ణోగ్రత మూడు డిగ్రీలకు మించదు. అత్యల్ప ఉష్ణోగ్రత ఒక డిగ్రీ సెల్సియస్‌గా ఇక్కడ వివిధ సందర్భాల్లో నమోదైంది.

3,600 అడుగుల ఎత్తులో..

సముద్రమట్టానికి 3,600 అడుగుల ఎత్తున ఉన్న లంబసింగి ఒకప్పుడు ఎలాంటి ప్రత్యేకతలూ లేని చిన్న గిరిజన పల్లె. అటవీశాఖ చెక్‌పోస్టు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఆశ్రమ గురుకుల పాఠశాల మాత్రమే ఉండేవి. విశాఖపట్నం, నర్సీపట్నం, పాడేరు నుంచి బస్సులు మాత్రం ఈ ప్రాంతం మీదుగా తరచూ తిరిగేవి.

- శీతాకాలంలో కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవడం వల్ల చలి తీవ్రత ఎక్కువగానే ఉంటుంది. ఇక్కడ ఉన్న చెక్‌పోస్టు సెంటర్‌లో చాలాకాలం క్రితం ఓ చెట్టుకింద ఒక వ్యక్తి చలికి కొయ్యబారి చనిపోయాడని చెబుతుంటారు. అందువల్ల ఈ ప్రాంతాన్ని కొర్రబయలు అని కూడా పిలిచేవారు.
- మైదాన ప్రాంతంలో సాధారణంగా ఏడాదికి నాలుగు నెలలు మాత్రం చలి ఉంటుంది. కానీ లంబసింగి ప్రాంతంలో అక్టోబర్ నుంచి ఫిబ్రవరి వరకు చలి వణికిస్తుంది. సెప్టెంబర్ మొదటి వారం నుంచి చలి ప్రభావం కనిపిస్తుంది. డిసెంబర్‌లో ఒక డిగ్రీ సెంటీగ్రేడ్ నమోదైన సందర్భాలు ఉన్నాయి. ఇక్కడికి 20 కిలోమీటర్ల దూరంలో ఉండే చింతపల్లిలో ఉష్ణోగ్రత ఇక్కడకన్నా రెండు డిగ్రీలు ఎక్కువగా ఉంటుంది.

నిత్యం భోగి మంటలే..

ప్రతీ ఇంట్లో అందరికీ పెద్ద రగ్గులు ఉంటాయి. స్వెటర్లు, కంబళ్లు తప్పనిసరి. మంట కోసం కట్టెలు సిద్ధంగా ఉంచుకుంటారు. సాయంత్రమయ్యేసరికి ప్రతి ఇంట్లో అన్నం వండుకోవడానికన్నా ముందు కుంపట్లు సిద్ధం చేసుకుంటారు.

పర్యాటక సీజన్‌లో కళకళ

పర్యాటక సీజన్ వచ్చిందంటే చాలు లంబసింగి పర్యాటకులతో కళకళలాడుతుంది. ఇక్కడ పూర్తిస్థాయిలో వసతులు లేనందున సమీప నర్సీపట్నంలో బస చేసి తెల్లవారుజామున ఇక్కడి పర్యాటకులు వచ్చేవారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ ప్రాంతాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసింది. పర్యాటకశాఖ ఆధ్వర్యంలో రిసార్ట్‌ను అందుబాటులోకి తెచ్చింది. ప్రైవేట్ కాటేజీలు ఎక్కువ సంఖ్యలో ఉన్నాయి.

తాజంగిలో బోటు షికార్, జిప్‌లైన్

తాజంగి జలాశయంలో ఐటీడీఏ ఏర్పాటుచేసిన బోట్ షికార్ పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంటుంది. లంబసింగి వచ్చే పర్యాటకులందరూ 20 నిమిషాలు బోటులో షికారు చేసి ఎంతో సంతోషం పొందుతుంటారు. జలాశయం మీదుగా ఏర్పాటు చేసిన జిప్‌వే ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. సుమారు 250 మీటర్ల ఎత్తులో ఉన్న ఈ జిప్ లైన్ ద్వారా కొండపై నుంచి చెరువు వరకు జారుతూ ప్రకృతి అందాలను తిలకిస్తూ పర్యాటకులు ఎంజాయ్ చేస్తుంటారు.

కొండల్లో 'పాల సముద్రం'

చెరువులవేనం కొండల్లో ప్రకృతి అందాలు పాలసముద్రాన్ని తలపిస్తాయి. ఈ ప్రాంతం లంబసింగికి సుమారు ఆరు కిలోమీటర్ల దూరంలో ఉంది. కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండటంతో పొగమంచు దట్టంగా కమ్మి ఉంటుంది. మేఘాలు మనతో మాట్లాడుతున్నాయా అనిపిస్తుంది. ఈ అపురూప అందాలను తిలకించేందుకు ఎక్కడెక్కడినుంచో ప్రకృతి ప్రేమికులు ఇక్కడికి వస్తుంటారు. పర్యాటకులకు సౌకర్యవంతంగా ఉండేలా పాడేరు ఐటీడీఏ వ్యూపాయింట్‌ను నిర్మించింది.

- శీతల వాతావరణం ప్రారంభమైన నాటి నుంచి వచ్చే పర్యాటకులతో తెల్లవారుజాము నాలుగు గంటల నుంచి లంబసింగి సెంటర్ జాతరను తలపిస్తుంది. వీకెండ్‌లో అయితే ఇక చెప్పనక్కర్లేదు. శని, ఆదివారాల్లో అయితే చెరువులవేనం జనసంద్రంగా మారుతుంది. కొంతమంది శనివారం రాత్రి లంబసింగి వచ్చి గుడారాలు వేసుకొని రాత్రంతా జాగారం చేస్తూ దట్టంగా కురుస్తున్న పొగమంచును ఆస్వాదిస్తూ గడుపుతారు. వేకువజామున చెరువులవేనం వెళ్లి ప్రకృతి అందాలను తిలకిస్తారు.


లంబసింగిలో పర్యాటకశాఖ రిసార్ట్

మరో వ్యూపాయింట్

నర్సీపట్నం నుంచి లంబసింగి వచ్చే మార్గంలో బోడకొండమ్మ ఆలయం వద్ద మరో వ్యూపాయింట్ అందుబాటులోకి వచ్చింది. గత అరకు ఎంపీ మాధవి నిధులు వెచ్చించి దీనిని నిర్మించారు.

- నర్సీపట్నం నుంచి ప్రయాణం ప్రారంభించాక చుట్టూ దట్టమైన అటవీ ప్రాంతంలో మలుపులతో కూడిన రోడ్లు, పచ్చని చెట్ల మధ్య ఆహ్లాదకరంగా ప్రయాణం సాగుతుంది. ఈ మార్గంలో కాఫీ, మిరియం తోటలు ఆకట్టుకుంటాయి.
- విశాఖపట్నం, విజయవాడ, హైదరాబాద్ నుంచే కాకుండా ఏకంగా బెంగళూరు నుంచి కూడా వాహనాల్లో పర్యాటకులు ఇక్కడకు వస్తుంటారు. దీనిని బట్టి ఈ ప్రదేశానికి ఎంత క్రేజ్ ఉందో అర్థం చేసుకోవచ్చు. విశాఖపట్నం, నర్సీపట్నం నుంచి ఈ ప్రాంతానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉంది.


బోడకొండమ్మ గుడి వద్ద వ్యూపాయింట్


తాజంగిలో బోటు షికారు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే అభివృద్ధి



ఏజెన్సీలో పర్యాటక అభివృద్ధికి గత ప్రభుత్వం రూ.కోట్లలో నిధులు వెచ్చించి అభివృద్ధి చేసింది. తాజంగిలో స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం నిర్మాణం చేపట్టింది. చెరువులవేనం, బోడకొండ గుడి వద్ద వ్యూపాయింట్‌లు నిర్మించింది. కృష్ణాపురం వద్ద ఎకో టూరిజం ప్రాజెక్ట్‌ను ఏర్పాటుచేసింది. తాజంగి జలాశయాన్ని అభివృద్ధి చేసింది.

– మత్స్యరాస విశ్వేశ్వరరాజు, పాడేరు ఎమ్మెల్యే

కనీస వసతులు అవసరం



పర్యాటక ప్రాంతంగా ప్రాచుర్యం పొందడంతో ఈ ప్రాంత అందాలను చూడడానికి ఎంతోమంది కుటుంబాలతో వస్తున్నారు.ఈ ప్రాంతంలో కనీస వసతులు లేక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యం ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టాలి.వాహనాల నిలుపుదలకు పార్కింగ్ సౌకర్యం కల్పించాలి.

– ప్రశాంత్, పర్యాటకుడు విజయనగరం

గురుకుల బోధన సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు డిమాండ్

సాక్షి,పాడేరు: రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన గురుకుల విద్యాలయాల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ అధ్యాపకులు, ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించి ఉద్యోగ భద్రత కల్పించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు డిమాండ్ చేశారు. శనివారం ఆయన పాడేరులోని క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలోని గురుకుల విద్యాలయాల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ అధ్యాపకులు, ఉపాధ్యాయులు ఎనిమిది రోజులుగా రిలే దీక్షలతో ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నా రాష్ట్ర ప్రభుత్వం నుంచి కనీస స్పందన లేదని విమర్శించారు. ఉమ్మడి జిల్లాలోని 19 గురుకులాల్లో సుమారు 4వేల మంది వరకు గిరిజన విద్యార్థులు చదువుతున్నారన్నారు. అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉపాధ్యాయుల సమ్మెతో వారి చదువులకు తీవ్ర విఘాతం ఏర్పడిందన్నారు. న్యాయ సమ్మతమైన ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వ యంత్రాంగం కాలయాపన చేయడం దారుణమన్నారు. విద్యార్థులకు బోధన పరంగా నష్టం జరుగుతున్నా పట్టించుకోకపోవడం విచారకరమన్నారు.

అక్రమ మైనింగ్‌ను ఉపేక్షించం

సీసీఎఫ్ బీఎన్ఎన్ మూర్తి


టేకు వనాల్లో అధికారులకు సూచనలిస్తున్న సీసీఎఫ్ బీఎన్ఎన్ మూర్తి

రాజవొమ్మంగి: అక్రమ మైనింగ్‌ను ఉపేక్షించేది లేదని రాజమహేంద్రవరం సర్కిల్ సీసీఎఫ్ బీఎన్ఎన్ మూర్తి అన్నారు. శనివారం ఆయన స్థానిక అటవీక్షేత్ర కార్యాలయాన్ని సందర్శించారు. రేంజ్ పరిధిలో ఉన్న మైనింగ్ రికార్డులను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. తన పరిధిలోని 8 జిల్లాలకు చెందిన మూడు అక్రమ మైనింగ్‌పై కేసులు నమోదు చేసి కోర్టులో వేశామన్నారు. సిబ్బంది కొరత పరిష్కారానికి రిక్రూట్‌మెంట్ జరగాల్సి ఉందన్నారు. అడవుల సంరక్షణలో ఫ్రంట్‌లైన్ ఆఫీసర్లు బీవోలు, ఏబీవోల బాధ్యత కీలకమన్నారు., అయితే దాదాపు 350 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈ ఏడాది ఉపాధిహామీ నిధులతో సుమారు 350 హెక్టార్లలో వివిధ జాతులకు చెందిన వనాలు పెంచాలన్నది లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. అడవుల్లో అగ్నిప్రమాదాలు సంభవించకుండా ఫైర్‌లైన్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ ఏడాది తమ పరిధిలోని ఏర్పాటు చేసిన 35 నర్సరీల ద్వారా కోటి మొక్కల ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. రైతులకు ఉచితంగా మొక్కలు పంపిణీ చేస్తామన్నారు. రంపచోడవరం డీఎఫ్‌వో రవీంద్ర దామా, సబ్‌డీఎఫ్‌వో సుబ్బారెడ్డి, రేంజ్ అధికారి ఉషారాణి, ఎఫ్ఎస్‌వో రాము తదితరులు పాల్గొన్నారు.

పింఛను బకాయిల చెల్లింపునకు ఉత్తర్వులు

- కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి,పాడేరు: ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ పథకంలో మూడు నెలల బకాయిల చెల్లింపు ఈనెల ఒకటో తేదీ నుంచి అమల్లోకి వచ్చేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పింఛనుదారులు ఏదైనా కారణంతో పింఛన్ సొమ్ము తీసుకోని పక్షంలో మూడు నెలల వరకు పింఛన్ బకాయిలు చెల్లిస్తామన్నారు. మూడు నెలలు వరుసగా పింఛన్ తీసుకోని పక్షంలో సంబంధిత పింఛన్‌దారులను శాశ్వత వలసలుగా గుర్తించి, పింఛన్ నిలిపివేస్తామని పేర్కొన్నారు. తరువాత ఆయా పింఛన్‌దారులంతా ఎంపీడీవోల ద్వారా రోల్ బ్యాక్ పింఛన్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే పింఛనుదారుడు మృతిచెందితే జీవిత భాగస్వామికి పింఛన్ అమలుజేసేలా ఉత్తర్వులు వెలువడ్డాయన్నారు.

దట్టంగా మంచు.. వణికిస్తున్న చలి


చింతపల్లి సమీపంలోని అంతర్లలో దట్టంగా కురుస్తున్న మంచు


డుంబ్రిగుడలో చలిమంట కాగుతున్న గిరిజనులు

ఇబ్బందులు పడుతున్న ప్రజలు

చింతపల్లి: మన్యంలో మంచు దట్టంగా కురుస్తోంది. చలిగాలుల ప్రభావం ఎక్కువగా ఉంది. శనివారం జి.మాడుగులలో 10.2 డిగ్రీలు, చింతపల్లిలో 14, గూడెంకొత్తవీధిలో 13, డుంబ్రిగుడలో 12.6, హుకుంపేటలో 13.7, పెదబయలులో 13.9, అనంతగిరిలో 12.9, కొయ్యూరులో 17.4 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు అయినట్టు స్థానిక ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. గత నాలుగు రోజులుగా కనిష్ట ఉష్ణోగ్రతలు నిలకడగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.

డుంబ్రిగుడ: మండలంలో వారం రోజులుగా చలి తీవ్రత రోజురోజుకు పెరుగుతోంది. దీంతో చలి మంటలను ఆశ్రయిస్తున్నారు. ఎముకలు కొరికే చలిలో పర్యాటకులు శనివారం చాపరాయి జలపాతంలో స్నానాలు చేశారు.

న్యూస్‌రీల్

గిరిజన మహిళకు ప్లేట్‌లెట్ రిచ్ ప్లాస్మా చికిత్స

- చింతపల్లి ఏరియా ఆస్పత్రిలో నిర్వహణ


చికిత్స పొందిన మహిళ

చింతపల్లి: స్థానిక ఏరియా ఆస్పత్రిలో తొలిసారిగా కీళ్ల నొప్పులతో బాధపడుతున్న గిరిజన మహిళకు ప్లేట్ లెట్ రిచ్ ప్లాస్మా చికిత్స అందించినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ జి ప్రభావతి తెలిపారు. మోకాలు అరుగుదల వల్ల నొప్పులతో బాధపడుతున్న గిరిజన మహిళకు ఆర్థోపెడిక్ వైద్యాధికారి సాయికృష్ణ ప్లేట్‌లెట్ రిచ్ ప్లాస్మా చికిత్స చేసినట్టు ఆమె వివరించారు. కీళ్ల నొప్పులు నయం చేసే ఈ చికిత్స పొందాలంటే ప్రైవేట్ ఆస్పత్రిలో రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు ఖర్చు అవుతుందన్నారు. గిరిజన ప్రాంతంలో కీళ్ల నొప్పులతో బాధపడే రోగులు ఏరియా ఆస్పత్రికి వచ్చి చికిత్స పొందాలన్నారు. వైద్యాధికారి సాయికృష్ణను ఆమె అభినందించారు. వైద్యాధికారి రమేష్ పాల్గొన్నారు.

బీఈ, బీటెక్ సెమిస్టర్ పరీక్షలు వాయిదా

విశాఖ సిటీ: ఏయూ ఇంజనీరింగ్ కాలేజ్ గ్రౌండ్‌లో ఈ నెల 29న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సమావేశం నేపథ్యంలో ఏయూలో జరగాల్సిన బీఈ, బీటెక్ సెమిస్టర్ పరీక్షలు వాయిదా పడినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ టి.చిట్టిబాబు తెలిపారు. ఈ నెల 27, 28 29 తేదీల్లో జరగాల్సిన బీఈ/బీటెక్ 4/1 సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 30, డిసెంబర్ 2, 3 తేదీల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరగనున్నట్లు వెల్లడించారు.

ఎమ్మెల్సీ ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల

మహారాణిపేట(విశాఖ): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ముసాయిదా ప్రతిపాదిత ఓటర్ల జాబితాను శనివారం జిల్లా యంత్రాంగం ప్రకటించింది. ఈనెల 6వ తేదీ వరకు ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల్లో మొత్తం 17,404 మంది దరఖాస్తు చేశారు. ఆన్‌లైన్ ద్వారా 4,802 మంది, ఆఫ్‌లైన్ ద్వారా 12,602 దరఖాస్తు చేశారు. స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి, మొత్తం 15,287 మందికి ఓటు హక్కు కల్పించారు. వీరిలో పురుషులు 9,638 మంది,స్త్రీలు 5,649 మంది ఉన్నారు. ఈ ముసాయిదాపై డిసెంబర్ 9వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరిస్తారు. డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితాను ప్రకటిస్తారు. ప్రకటించిన ముసాయిదా జాబితాలో మార్పులు,చేర్పులకు వచ్చేనెల 9వ తేదీ వరకు www.coeandhra.nic.in అనే వెబ్‌సైట్‌లో కాని, సంబంధిత ఓటర్ల నమోదు అధికారికిగాని, సహాయ ఓటరు నమోదు అధికారులు లేదా ప్రత్యేక అధికారులకు గాని దరఖాస్తులను సమర్పించవచ్చు. ప్రచురించిన ముసాయిదా జాబితాలో అర్హులైన వారి పేరు నమోదు కాకపోతే కనీసం మూడేళ్ల బోధన అనుభవం గల ధ్రువీకరణ పత్రంతో పాటు అన్ని డాక్యుమెంట్లతో ఫారం–19 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యంతరాలను ఫారం–7 ద్వారా తెలియజేయాలి. జాబితాలో ఓటరు వివరాల మార్పుల కోసం ఫారం –8లో దరఖాస్తు చేయాలి.

ముసాయిదా జాబితాలో ఓటర్ల వివరాలు

జిల్లా	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
శ్రీకాకుళం	2,725	1,181	00	3,906
విజయనగరం	2,164	1,261	00	3,425
మన్యం పార్వతీపురం	1,267	595	00	1,862
అల్లూరి సీతారామరాజు	831	527	00	1,358
విశాఖపట్నం	1,426	1,421	00	2,847
అనకాపల్లి	1,225	664	00	1,889
మొత్తం	9,638	5,649	00	15,287

జనన ధ్రువీకరణ పత్రాల జారీకి ఆదేశం

- కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి,పాడేరు: జిల్లావ్యాప్తంగా జనన ధ్రువీకరణ పత్రాలను యుద్ధప్రాతిపదికన జారీ చేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ శనివారం ఓ ప్రకటనలో ఆదేశించారు. సంవత్సరం దాటిన పిల్లలకు జనన ధ్రువీకరణ పత్రాల కోసం అందిన దరఖాస్తులను ఆధార్ కారణంగా గ్రామ సచివాలయాల్లో తిరస్కరిస్తున్నారని, ఈమేరకు జనన ధ్రువీకరణ పత్రాలు, మృతులకు సంబంధించి ధ్రువీకరణ పత్రాల జారీకి సంబంధిత మండల అధికారులు వెంటనే ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ చేయాలన్నారు. లబ్ధిదారుల సమ్మతితో తహసీల్దార్లు, సబ్‌కలెక్టర్లు వీటిని ఆమోదించాలన్నారు. సంబంధిత పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ సహాయకులు మిషన్ మోడ్‌లో కసరత్తు పూర్తిచేయాలన్నారు. జిల్లాలోని 22 మండలాల పరిధిలో సర్వే ప్రకారం 16,047 లేట్ బర్త్ సర్టిఫికెట్లు అవసరమున్నట్టు గుర్తించామన్నారు. ఇందుకు సంబంధించి మండలాల వారీగా పంపించే జాబితాలను పరిశీలించి ఎంపీడీవో, తహసీల్దార్ ధ్రువపత్రాల జారీకి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

గ్రామ వలంటీర్ల ఆందోళన

- ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్
- పాడేరు, చింతూరులో ధర్నా


చింతూరులో ర్యాలీ నిర్వహిస్తున్న వలంటీర్లు



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న గ్రామ వలంటీర్లు

సాక్షి,పాడేరు: ఏపీ గ్రామ వలంటీర్లంతా తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం పాడేరులో ఆందోళన చేపట్టారు. కలెక్టరేట్‌ను ముట్టడించారు. అనంతరం ధర్నా చేశారు.ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎల్.సుందర్రావు మాట్లాడుతూ జిల్లాలోని గ్రామ వలంటీర్లందరికీ నెలకు రూ.10వేల వేతనంతో ఉద్యోగాల్లో వెంటనే నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రెండు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించడమే కాకుండా బలవంతంగా రాజీనామాలు చేయించిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.10వేలకు వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చి, సీఎం కాగానే వలంటీర్ల వ్యవస్థను నిర్వీర్యం చేయడం అన్యాయమన్నారు. కూటమి ప్రభుత్వం వలంటీర్లకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అసెంబ్లీ సాక్షిగా మంత్రులంతా అబద్ధాలు చెబుతున్నారని వలంటీర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.ప్రసాదరావు, ఇతర నాయకులు కొండబాబు ఆందోళన వ్యక్తంచేశారు. వలంటీర్ల వ్యవస్థ లేకుండా 2024 మే నెల వరకు వలంటీర్లకు ఎలా జీతాలు చెల్లించారని వారు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అసెంబ్లీలో మంత్రి బాల వీరాంజనేయ వార్డు, గ్రామ వలంటీర్ల విషయంలో అసత్యాలు చెబుతుంటే ముఖ్యమంత్రి చంద్రబాబు మౌనంగా ఉండడం దారుణమని వారు మండిపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా వార్డు, గ్రామ వలంటీర్లను విధుల్లో కొనసాగించాలని లేనిపక్షంలో కలెక్టరేట్‌లు ముట్టడించి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ డాక్టర్ అభిషేక్ గౌడకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నేత బి.సన్నిబాబు,వలంటీర్ల సంఘ ప్రతినిధులు జి.దేవా, చిన్నయ్య, శోభన్, సురేష్‌కుమార్, సత్యారావు, తాతబాబు, కృష్ణారావు, ఆనంద్, కొండమ్మ, భవాని తదితరులు పాల్గొన్నారు.

చింతూరు: గ్రామ, వార్డు వలంటీర్ల ఉపాధిని కాపాడి ఉద్యోగభద్రత కల్పించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో వలంటీర్లు శనివారం చింతూరులో ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక ఐటీడీఏ వద్ద ఆందోళన చేపట్టారు. ఐటీడీఏ పీవో అపూర్వభరత్‌కు వినతిపత్రం అందజేశారు.

ముగిసిన ఏయూ అంతర్ కళాశాలల అథ్లెటిక్స్

- పురుషుల విభాగంలో అరకు ప్రభుత్వ కళాశాల
- మహిళల విభాగంలో ప్రగతి కాలేజీకి ప్రథమస్థానం



విజేతగా నిలిచిన అరకు ప్రభుత్వ కాలేజీ విద్యార్థులు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం స్పోర్ట్స్ బోర్డ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్ కళాశాలల అథ్లెటిక్స్ పోటీలు శనివారం ముగిశాయి. ఈ పోటీల్లో పురుషుల విభాగంలో అరకు గవర్నమెంట్ డిగ్రీ కళాశాల తొలి స్థానాన్ని కైవసం చేసుకుంది. పురుషుల విభాగంలో ద్వితీయ స్థానంలో ప్రగతి ఫిజికల్ ఎడ్యుకేషన్, తృతీయ స్థానంలో సాలూరు గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ నిలిచాయి.

- మహిళల విభాగంలో ప్రగతి కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ విద్యార్థులు తొలి స్థానం కైవసం చేసుకున్నారు. ద్వితీయ స్థానంలో ఎంఆర్ కళాశాల, తృతీయ స్థానంలో విజయనగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిలిచాయి.

33 కళాశాలలు.. 620 మంది క్రీడాకారులు

44 ఈవెంట్స్‌లో పురుషులు, మహిళల విభాగాల్లో ఈ క్రీడా పోటీలు నిర్వహించగా 33 కళాశాలలకు చెందిన 620 మంది క్రీడాకారులు హోరాహోరీగా పోటీ పడ్డారు. 100 మీటర్లు, లాంగ్ జంప్, జావెలిన్, 400 మీటర్స్ హర్డిల్స్, క్రాస్ కంట్రీ క్రీడల్లో ఉత్కంఠ భరిత పోరు జరిగింది. శనివారం సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమంలో ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు ముఖ్యఅతిథిగా పాల్గొని విజేతలుగా నిలిచిన క్రీడా జట్లను అభినందించారు. ఏయూ స్పోర్ట్స్ బోర్డు డైరెక్టర్ ఆచార్య ఎస్. విజయ మోహన్‌తో కలిసి విజేతలకు ట్రోఫీలు, జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఏయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి ఆచార్య పల్లవి, వర్సిటీ అనుబంధ కళాశాలల ఫిజికల్ డైరెక్టర్లు, రీసెర్చ్ స్కాలర్స్, ఎంపీఈడీ విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

లాభాపేక్ష రహిత సంస్థల ఫోరం ఏర్పాటుకు ఆహ్వానం

- జేసీ డాక్టర్ అభిషేక్ గౌడ

సాక్షి, పాడేరు: కలెక్టర్ కార్యాలయంలో నమోదు చేసుకున్న అన్ని స్వచ్ఛంద సంస్థలు, సీఎస్ఆర్, లాభాపేక్షలేని సంస్థలతో జిల్లా లాభాపేక్ష రహిత సంస్థల ఫోరం ఏర్పాటుకు ఆహ్వానిస్తున్నామని జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎం.జే. అభిషేక్‌గౌడ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఈనెల 29వతేదీ సాయంత్రం 4గంటలకు కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఈ ఫోరంను ప్రారంభిస్తారని ఆయన తెలిపారు. అనంతరం స్వచ్ఛంద సంస్థలు, సీఎస్సార్, లాభాపేక్షలేని సంస్థల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తారని ఆయన తెలిపారు. పూర్తి వివరాలకు జి.నారాయణరెడ్డిని 8106797474 నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

వినియోగదారులకు మెరుగైన సేవలు



షోరూంను ప్రారంభిస్తున్న ప్రమోద్‌పాండే తదితరులు

అరకులోయ టౌన్: మండల కేంద్రంలోని పద్మజ సుజుకి షోరూంను సుజుకి జోనల్ మేనేజర్ ప్రమోద్ పాండే, రీజనల్ మేనేజర్ శివ రామకృష్ణల చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినియోగదారులకు అన్ని రకాలుగా మెరుగైన సేవలందిస్తామన్నారు. మన్యంలో కూడా షోరూమ్‌లు ఏర్పాటుచేసి, తమ సేవలను విస్తరించనున్నట్టు తెలిపారు. ఈ షోరూమ్‌లో స్పేర్ పార్టులు కూడా అందుబాటులో ఉంటాయన్నారు. వినియోగదారులు సంతృప్తి చెందే విధంగా నూరుశాతం సర్వీసులు అందిస్తామన్నారు. వరుణ్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్‌దేవ్, వరుణ్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినోద్‌కుమార్, పద్మజ సుజుకి జీఎం రఫీ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గంజాయి నిర్మూలనకు కృషి

డుంబ్రిగుడ: గంజాయి సాగు, రవాణా చట్టరీత్యా నేరమని, దీనికి దూరంగా ఉండాలని ఎస్‌ఐ కె.పాపినాయుడు చెప్పారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మండల కేంద్రంలో శనివారం జరిగిన కార్యక్రమంలో వివిధ పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయ సాగు చేసినా, రవాణా జరుగుతున్న పోలీసులకు సమాచారం అందజేయాలని కోరారు. వైస్ ఎంపీపీ శెట్టి ఆనంద్ పాల్గొన్నారు.

గంగవరం: గ్రామాల్లో నాటుసారా నిర్మూలనకు కృషి చేస్తున్నామని, గ్రామస్తులు సారా తయారీ, అమ్మకాలపై సమాచారం ఇస్తే చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ డి.భూషణం అన్నారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. గ్రామాల్లో సారా, డ్రగ్స్ అనర్థాలపై, లోన్ యాప్స్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. విద్యావశ్యకతపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

గజ్జె ఘల్లుమంది

ఆకట్టుకున్న ఆదివాసీ స్వాభిమాన్ ఉత్సవాలు

- అలరించిన సాంస్కృతిక రూపాలు
- గిరిజన ఉత్పత్తులకు ఆదరణ



గిరిజన ప్రాంతాల తేనెను రుచిచూస్తున్న నగరవాసులు



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ఏయూక్యాంపస్(విశాఖ): బీచ్‌రోడ్డులోని విశ్వప్రియ ఫంక్షన్ హాలు ఎదురుగా శనివారం ఆదివాసీ స్వాభిమాన ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం, గిరిజన సంక్షేమ శాఖ, ఆదివాసీ సాంస్కృతిక పరిశోధన, శిక్షణ మిషన్ సంయుక్తంగా మూడు రోజులు ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నాయి. ముందుగా ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ జి.డి.వి.శంకరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆదివాసీ సంస్కృతిని ప్రతిబింబిస్తూ చేసిన నృత్యాలు విశాఖ వాసులను, పర్యాటకులను ఆకట్టుకున్నాయి. కొమ్ము, థింసా, జానపద నృత్యాలు అలరించాయి. గిరిజన ప్రాంతాల్లోని పాఠశాలల విద్యార్థినులు ప్రదర్శించిన నృత్యాలు అందరి ప్రశంసలు అందుకున్నాయి. ఈ సందర్భంగా ఐటీడీఏ పాడేరు, శ్రీశైలం, రంపచోడవరం, నెల్లూరు, చింతూరు, సీతంపేట ప్రాంతాల నుంచి ఆదివాసీలు తాము తయారు చేసిన, పండించిన ఉత్పత్తులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్టాళ్లలో విక్రయించారు. మిల్లెట్ ఉత్పత్తులు, వస్త్రాలు, వెదురు వస్తువులు, మట్టి కళారూపాలు, గిరిజన ప్రాంతాల్లో లభించే తేనె, వెదురు బొంగు చికెన్‌ను విశాఖ వాసులు కొనుగోలు చేశారు.

బిడ్డను చూడకుండానే అనంత లోకాలకు..

- మగశిశువుకు జన్మనిచ్చి తల్లి మృతి
- గోకవరం ఆస్పత్రిలో ఘటన
- మృతురాలు అటవీశాఖ ఉద్యోగిని



ఆస్పత్రిలో పసికందుకు సపర్యలు చేస్తున్న వైద్య సిబ్బంది



వెంకటలక్ష్మి (ఫైల్)

గోకవరం (తూర్పుగోదావరి): పండంటి మగబిడ్డను జన్మనిచ్చిన తల్లి.. తన బిడ్డను చూసుకోకుండానే కన్నుమూసింది. తూర్పు గోదావరి జిల్లా గోకవరం ప్రభుత్వాస్పత్రిలో శనివారం ఈ విషాద ఘటన జరిగింది. వివరాల్లోకి వెళితే.. అల్లూరి సీతారామరాజు జిల్లా రాజవొమ్మంగి మండలం కొండపల్లి గ్రామానికి చెందిన బీరబోయిన వెంకటలక్ష్మి (35) రెండేళ్లగా గోకవరంలో ఫారెస్టు ఠాణాలో ఠాణాదార్‌గా విధులు నిర్వహిస్తోంది. ఆమె భర్త దుర్గాప్రసాద్ ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. వెంకటలక్ష్మి గర్భం దాల్చి నెలలు నిండటంతో తొలి కాన్పు కోసం శుక్రవారం రాత్రి 9.30 గంటల ప్రాంతంలో గోకవరం ప్రభుత్వాస్పత్రిలో చేరింది. ఆస్పత్రి డాక్టర్లు పరీక్షించి శనివారం శస్త్ర చికిత్స చేసేందుకు ఏర్పాట్లు చేశారు. శనివారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో శస్త్ర చికిత్స చేయగా మగబిడ్డకు జన్మనిచ్చి ఆమె మృత్యువాత పడింది. విషయం తెలుసుకున్న భర్త, కుటుంబ సభ్యులు, తోటి అటవీశాఖ సిబ్బంది అక్కడకు చేరుకుని విలపించారు. అనంతరం వెంకటలక్ష్మి మృతదేహాన్ని అంబులెన్స్‌లో స్వస్థలానికి తీసుకువెళ్లారు. దీనిపై ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వనజ కుమారిని వివరణ కోరగా ఉమ్మనీరు రక్తంలో కలవడంతో గుండె పోటుకు గురై తల్లి మృతి చెందిందన్నారు. 35 ఏళ్లకు గర్భం దాల్చడం, ఒబెసిటీ కారణంగా ఎక్కువగా ఇటువంటి పరిస్థితి తలెత్తే అవకాశం ఉందన్నారు.

అటవీశాఖలో విషాదం

విధి నిర్వహణలో తోటి సిబ్బందితో ఎంతో కలివిడిగా ఉంటూ క్రమశిక్షణగా విధులు నిర్వహించే వెంకటలక్ష్మి మృతి చెందడంతో అటవీశాఖలో విషాదం నెలకొంది. ఆమె వెయిట్ లిఫ్టింగ్, త్రోబాల్ వంటి పోటీల్లో అటవీశాఖ తరపున పాల్గొనేదని, 15 రోజుల క్రితం వరకు విధులు నిర్వహించిందని తోటి ఉద్యోగులు తెలిపారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

- జీసీసీ ఎండీ కల్పనా కుమారి
- గిరిజనులకు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న జీసీసీ ఎండీ కల్పనా కుమారి

కొమ్మాది: బిర్సా ముండా 150వ జయంతిని పురస్కరించుకుని జన జాతి గౌరవ దివస్‌లో భాగంగా రుషికొండలోని గాయత్రి పీజీ, డిగ్రీ కళాశాలలో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం, గిరిజన సాంస్కృతిక పరిశోధన, శిక్షణ మిషన్(టీసీఆర్‌టీఎం) ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు జరగనున్న ఈ పోటీలను శనివారం గిరిజన కో–ఆపరేటివ్ కార్పొరేషన్(జీసీసీ) వైస్ చైర్‌పర్సన్, ఎండీ కల్పనా కుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలు మానసిక ఆనందంతో పాటు ఉల్లాసం కలిగిస్తాయన్నారు. ఈ పోటీల్లో 8 ఐటీడీఏలకు చెందిన 500 మంది క్రీడాకారులు పాల్గొంటున్నట్లు తెలిపారు. కాగా.. వీరికి ఆర్చరీ, జావెలిన్ త్రో, వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా టీసీఆర్‌టీఎం ఆవరణలో ఏర్పాటు చేసిన గిరిజన సంతను జీసీసీ ఎండీ ప్రారంభించారు. ఇక్కడ వివిధ ఐటీడీఏలకు చెందిన గిరిజన రైతులు/చేతివృత్తుల వారు 10 స్టాళ్లను ఏర్పాటు చేశారు. ఈ సంత ఈ నెల 26వ తేదీ వరకు జరగనుంది. టీసీఆర్‌టీఎం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ రాణి మందా తదితరులు పాల్గొన్నారు.

జోలాపుట్టు సరిహద్దు వంతెనకు మరమ్మతులు

- అధికారులు స్పందించకపోవడంతో రిపేర్ పనులకు ముందుకొచ్చిన గ్రామస్తులు



వంతెనకు మరమ్మతు చేయిస్తున్న గ్రామస్తులు

ముంచంగిపుట్టు: ఆంధ్ర– ఒడిశా రాష్ట్రాలను కలిపే సరిహద్దు ఐరెన్ వంతెన ఈ ఏడాది సెప్టెంబర్‌లో జోలాపుట్టు జలాశయం నుంచి 50 వేల క్యూసెక్కుల నీటి విడుదలతో కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. అప్పటికప్పుడు అధికారులు మట్టి, రాళ్లతో పూడ్చివేసి, చేతులు దులుపుకున్నారు. పాడైన ఐరెన్ వంతెనకు మాత్రం మరమ్మతు చేయలేదు. ప్రస్తుతం వంతెనపై సైడ్ వాల్స్ పూర్తిగా దెబ్బతిన్నాయి. కొన్ని చోట్ల రంధ్రాలు ఏర్పడాయి. గత మూడు నెలలుగా సరిహద్దు గ్రామాల ప్రజలు దీంతో వంతెనపై రాకపోకలు సాగించేందుకు భయపడుతున్నారు. సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా, పత్రికలో కథనాలు ప్రచురితమైనా అధికారులను ఎటువంటి స్పందన లేదు. దీంతో జోలాపుట్టు గ్రామస్తులు ప్రమాదాలు జరగకుండా ముందుగానే చర్యలు తీసుకోవాలని ఉద్దేశంతో చందాల రూపంలో నిధులు సమకూర్చుకుని, శనివారం ఐరెన్ వంతెనకు మరమ్మతు పనులు చేయించారు. సైడ్ వాల్స్ వేయించి, రంధ్రాలను మూయించారు. దీంతో ఐరెన్ వంతెనపై ప్రయాణానికి భయపడాల్సిన పరిస్థితి తొలగింది. ఇప్పటికైనా ప్రాజెక్టు, జలాశయం అధికారులు, ఇరురాష్ట్రాల ప్రభుత్వాలు స్పందించి సరిహద్దులో పూర్తిస్థాయి వంతెన నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

వెల్లివిరిసిన ఆధ్యాత్మికత



రాజవొమ్మంగి శివాలయంలో లక్ష బిల్వార్చన



ముంచంగిపుట్టులో దుర్గమ్మకు పూజలు చేస్తున్న భవానీ మాలధారులు

- భక్తిశ్రద్ధలతో లక్ష బిల్వార్చన
- వైభవంగా అంబలం పూజ

రాజవొమ్మంగి: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో గల శివాలయం వద్ద శనివారం లక్ష బిల్వార్చనను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. వేదమంత్రాల నడుమ మారేడు దళాలతో అర్చనలు జరిపారు. అనంతరం భారీ అన్నసమారాధన జరిగింది. సాయంకాలం లక్ష దీపోత్సవ కార్యక్రమం కనుల పండువగా జరిగింది.

ముంచంగిపుట్టు:మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి భవాని మాలధారుల ఆధ్వర్యంలో దుర్గమ్మ అంబలం పూజను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. దుర్గమ్మ ప్రతిమను వివిధ రకాల పూలతో అలంకరించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, భజనలు చేశారు. అనంతరం నిర్వహించిన అంబలం పూజకు అధిక సంఖ్యల్లో భక్తులు వచ్చారు. ప్రసాద వితరణ జరిగింది. గురు భవానీలు శంకర్‌రావు, లక్ష్మణ్, నాగర్జున్ తదితరులు పర్యవేక్షించారు.

శ్రమదానంతో తాత్కాలిక రహదారి నిర్మాణం



గొబ్బరపడ-జోడిగుమ్మ మట్టి రహదారి నిర్మాణానికి బండరాయిని తొలగిస్తున్న గ్రామస్తులు

ముంచంగిపుట్టు: మండలంలోని మారుమూల రంగబయలు పంచాయతీ ఆరు గ్రామాల గిరిజనులు శ్రమదానంతో వారం రోజులు కష్టపడి తాత్కాలిక రహదారి నిర్మించుకున్నారు. ఎట్టకేలకు శనివారంతో పనులు పూర్తయ్యాయి. డుమడగూడ , జర్రెలపోదర్, డెంగ్‌సిమ్లి, నూవగూడ, బుడ్డపనస, గొబ్బరపడ గ్రామాల రహదారి కోసం 4 కిలోమీటర్లు మేరకొండలు తవ్వి, మట్టి చదును చేసి, పెద్ద పెద్ద బండరాళ్లను తొలగించి తాత్కాలిక రహదారిని పూర్తి చేశారు. గతంలో జర్రెలపోదర్ గ్రామస్తులు రహదారి కోసం శ్రమదానంతో కొంతమేర పనులు చేశారు. ఆ గ్రామాన్ని ఆదర్శంగా తీసుకున్న రహదారి లేని ఐదు గ్రామాల గిరిజనులు జర్రెలపోదర్ గ్రామస్తులతో కలిసి శ్రమదానంతో పూర్తిస్థాయిలో ద్విచక్రవాహనాలు రాకపోకలు సాగించే విధంగా మట్టి రహదారిని నిర్మించుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలకు చెందిన పలువురు మాట్లాడుతూ సరైన రహదారి లేక ఎన్నో ఏళ్ల నుంచి రవాణా కష్టాలు పడుతున్నామని, గ్రామాల్లో 180 కుటుంబాలకు చెందిన 600పైగా గిరిజనులము జీవిస్తున్నామన్నారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులను ఆస్పత్రికి తరలించాలన్న, నిత్యావసర సరకులు తీసుకురావాలన్న అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై అనేకసార్లు జిల్లా, మండల స్థాయి అధికారులను కలిసి విన్నవించినా స్పందన లేదన్నారు. ఈ మేరకు ఆరు గ్రామాల గిరిజనులంతా కలిసి శ్రమదానంతో కష్టపడి తాత్కాలిక రహదారిని నిర్మించుకున్నామన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామానికి పూర్తిస్థాయిలో పక్కా రహదారి నిర్మించి, రవాణా కష్టాలు తీర్చాలని ఆరు గ్రామాల గిరిజనులు కోరుతున్నారు.

విద్యార్థులకు అభినందనలు



పోటీల్లో సాధించిన పతకాలు, అందుకున్న ప్రశంసపత్రాలతో విద్యార్థులు

రాజవొమ్మంగి: రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో ఉత్తమ ప్రతిభ చాటి, పతకాలు సాధించిన విద్యార్థులకు అధ్యాపకులు, స్థానికులు అభినందించారు. అరకులోయలో ఇటీవల జరిగిన క్రీడా పోటీల్లో మండల కేంద్రంలోని ఏకలవ్య పాఠశాలకు చెందిన 33 మంది విద్యార్థులు వివిధ విభాగాల్లో స్వర్ణ పతకాలు సాధించినట్టు ప్రిన్సిపాల్ ఎం.వి.కృష్ణారావు చెప్పారు. ఇందులో భాగంగా వెయిట్‌లిఫ్టింగ్‌లో–12 గోల్డ్, ఒక రజత పతకం, జూడోలో– 20 స్వర్ణ పతకాలు, హైజంప్‌లో ఒక గోల్డ్, ఒక రజతం , ఒక కాంస్యం, కుస్తీ పోటీలో రెండు గోల్డ్, రెండు రజత, యోగాలో ఒక గోల్డ్, ఒక కాంస్య పతకం సాధించినట్టు చెప్పారు. బ్యాడ్మింటన్‌లో రెండు కాంస్య పతకాలు సాధించినట్టు తెలిపారు. ఆయా పోటీల్లో 19 మంది బాలికలు, 25 మంది బాలులు పాల్గొనట్టు ఆయన చెప్పారు. పీఈటీ మెఘా రావత్, వెయిట్‌లిఫ్టింగ్ కోచ్ మాణిక్యాలరావు అధ్యాపకులు పాల్గొన్నారు.

పర్యాటక ప్రదేశాల్లో పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ

పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు : స్థానిక ఐటీడీఏ పరిధిలోని పర్యాటక ప్రదేశాలను పరిశుభ్రంగా, ఆహ్లాదంగా ఉంచేందుకు స్థానిక సంస్థల ఉద్యోగులు ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలని పీవో అభిషేక్ ఆదేశించారు. శనివారం డీఎల్పీవో పీఎస్ కుమార్‌తో కలిసి ఆయన సమీక్షించారు. అరకులోయ, అనంతగిరి, డుంబ్రిగుడ, పాడేరు, చింతపల్లి మండలాల పరిధిలోని పర్యాటక ప్రదేశాల్లో పారిశుధ్య నిర్వహణ, పార్కింగ్ సౌకర్యం తదితర అంశాలపై ఆయన అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. టూరిజం సీజన్ ముగిసేంత వరకు ప్రతిరోజు పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి వ్యర్థాలను తొలగించాలన్నారు. పారిశుధ్య నిర్వహణపై సిబ్బందిని షిఫ్ట్ విధానంలో డ్యూటీలు, పర్యాటక ప్రదేశాల్లో డస్ట్‌బిన్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. చిలకలగెడ్డ, వంట్లమామిడి, డొనూరు ప్రాంతాల్లో వనధన్ వికాస్ కేంద్రాల్లో తయారైన ఉత్పత్తులతో స్టాళ్ల ఏర్పాటు చేయాలని డీఆర్‌డీఏ పీడీని ఆదేశించారు. పర్యావరణాన్ని కాపాడేందుకు పర్యాటకులు సహకరించాలని ఆయన కోరారు.